# క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

○ జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పోటీల్లో విజేతలు ○ సన్మానించిన ఉపాధ్యాయులు

*మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొంది బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పాఠశాలలు, కళాశాలల ఆధ్వర్యంలో విజేతలను ఘనంగా సన్మానించి, అభినందించారు.*

## ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టుకు ఇద్దరు గురుకుల విద్యార్థులు ఎంపిక

జిన్నారం, అక్టోబర్ 4: ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టుకు జిన్నారం గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు బుధవారం ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేటలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 17 ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టు సెలక్షన్స్‌లో గిరిజన గురుకులంలో ఎంపీసీ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కే.ప్రతాప్, టీ.జశ్వంత్ ఇద్దరు విద్యార్థులు ఎంపిక అయ్యారని వివరించారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులను ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, కోచ్ మహేశ్ అభినందించారు.



ఎస్‌జీఎఫ్ అండర్-17 క్రికెట్ జట్టుకు ఎంపికైన గురుకుల విద్యార్థులు కే.ప్రతాప్, టీ.జశ్వంత్



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సాధించిన ప్రశంసా పత్రాలను పీడీ శశిరేఖ, ఉపాధ్యాయులతో కలిసి చూపుతున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు

## అథ్లెటిక్స్‌లో మెరిసిన విద్యార్థులు..

బొల్లారం, అక్టోబర్ 4: తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బొల్లారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చారని పాఠశాల ప్రిన్స్‌పాల్ శైలజ, పీడీ శశిరేఖ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో విజేతలను ఉపాధ్యాయులతో కలిసి ప్రిన్సిపల్ అభినందించారు. సెప్టెంబర్ 29, 30, అక్టోబర్ 1న కరీంనగర్‌లోని రీజినల్ స్పోర్ట్స్ స్కూల్లో నిర్వహించిన తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పదో తరగతి విద్యార్థులు సంధ్య (లాంగ్‌జంప్), సాయి ప్రవళిక, పవని, శ్రీలత, వైష్ణవి (మిడ్లీ రీలే), 8వ తరగతి విద్యార్థులు యమున, రేణుక, అలేఖ్య, చైత్ర, అక్షిత్, యశ్వంత్, శశి ఆయా ఈవెంట్లలో ప్రతిభను కనబర్చి ప్రశంసా ప్రతాలు పొందినట్లు వారు వివరించారు.



జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థి శరత్‌చంద్రను సన్మానిస్తున్న క్రీడాకారులు, ఉపాధ్యాయులు

## ఫుట్‌బాల్ జాతీయ క్రీడాకారుడికి సన్మానం

రామాయంపేట, అక్టోబర్ 4: ఫుట్‌బాల్ పోటీలకు జాతీయస్థాయికి ఎంపికైన అండర్-12 జట్టులో శరత్‌చంద్రను క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. బుధవారం రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమానికి హాజరైన శరత్‌చంద్రను ఘనంగా తోటి క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురంలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో శరత్‌చంద్ర ప్రతిభచాటి బహుమతులు గెలుచుకున్నాడు. రామాయంపేటలో ఏర్పాటు చేసిన సన్మానసభకు శరత్‌చంద్రను స్థానిక యువజ్యోతి క్లబ్ అధ్యక్షుడు బొంతల సత్యానారాయణ అండర్-12లో జాతీయ స్థాయిలో బహుమతి సాధించిన విద్యార్థిని ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. అనంతరం తాలూకా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో చేగుంట, డి.ధర్మారం, మెదక్ ప్రాంత విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల పీఈటీ భూదయ్య, శంకర్ అకాడమి కో-ఆర్డినేటర్ సత్యనారాయణ, కైరంకొండ శ్రీనివాస్ తదితరులున్నారు.

# ఇన్‌పుట్ డీలర్లకు 48 రోజుల శిక్షణ

## ప్రారంభించిన అదనపు కలెక్టర్ మాధురి



సంగారెడ్డిలో పాల్గొన్న ఇన్‌పుట్ డీలర్లు





మాట్లాడుతున్న సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 4: ఇన్‌పుట్ డీలర్ల శిక్షణ కార్యక్రమాన్ని డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (డీఏఈఎస్ఐ) ఆధ్వర్యంలో సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి బుధవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 80 మంది ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. 40 మంది చొప్పున రెండు బ్యాచ్‌లుగా చేసి సంవత్సరానికి 48 రోజుల శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణలో భాగంగా వారానికి ఒకరోజు థియరీ తరగతులు, మిగతా 6 రోజులు క్షేత్ర పర్యటన ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు, ఏడీఏలు సుధ, పుష్ప, రామకృష్ణ, ఏవోలు సమెట్, రమేశ్, శ్రీనివాస్, అకాడెమిక్ అసోసియేట్ మేనేజర్ డాక్టర్ నవీన్, ఆత్మ సూపరింటెంటెంట్ గులాం మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

# రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

రామాయంపేట, అక్టోబర్ 4: గ్రామ పంచాయతీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, నర్సరీలో మొ క్కల లెక్క పక్కాగా ఉండాలని మెదక్ జడ్పీ సీఈవో వెంకటశైలేశ్ పేర్కొన్నారు. బుధవారం రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామానికి విచ్చేసిన ఆయన పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించి, మొక్కలను జాగ్రత్తగా కాపాడాలని, కార్యదర్శి మౌనికకు పలు సూచనలు చేశారు. నర్సరీల్లోని మొక్కలకు కచ్చితంగా లెక్క ఉండాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కువ శాతం పూలు, పండ్ల మొక్కలకు ప్రా ధాన్యత కల్పించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల కార్యదర్శులు మొక్కలపై ప్రత్యేక దృష్టి పెట్టి మొక్కలను కాపాడుతున్నారని తెలిపారు. ఆయనవెంట రామాయంపేట ఎంపీడీవో ఉమాదేవి, కార్యదర్శి మౌనిక, సర్పంచ్ రాణమ్మ, ఎంపీటీసీ మల్లన్నగారి నాగులు తదితరులున్నారు.



గ్రామంలో నర్సరీని పరిశీలిస్తున్న మెదక్ జడ్పీ సీఈవో వెంకటశైలేశ్, ఎంపీడీవో

# అల్పాహారం పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు

## మెదక్ డీఈవో రాధాకిషన్



చిన్నగొట్టిముక్ల జడ్పీ పాఠశాల సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ డీఈవో రాధాకిషన్

శివ్వంపేట, అక్టోబర్ 3: రాష్ట్ర ప్రభుత్వం సర్కారు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ (అల్పాహారం) అందజేసేందుకు ఆదేశించిందని మెదక్ డీఈవో రాధాకిషన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ సందర్శించి సమీక్షా సమావేశం నిర్వహించారు. రేపు చిన్నగొట్టిముక్లలో అల్పాహారం ప్రారంభించేందుకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యార్థులు ఉదయం పాఠశాలకు రాగానే అల్పాహారం అందజేయడం అభినందనీయమని, పోషకాహార లోపాన్ని, రక్తహీనతను నిర్మూలించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో బుచ్యానాయక్, సర్పంచ్ బాలమణీనరేందర్, ఎంపీటీసీలు నువ్వుల దశరథ, గోవింద్‌నాయక్, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఇందుమతి, బిక్యతండా సర్పంచ్ సుమలతారాజ్‌కుమార్, కాంట్రాక్టర్ కిషన్‌రావు తదితరులున్నారు.

## వృత్తి నైపుణ్య శిక్షణకు
# దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ అర్బన్, అక్టోబర్ 4: నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ స్వయం ఉపాధి కోర్సుల నందు శిక్షణ ఇవ్వడానికి బ్యాచ్ తరగతులు ప్రారంభమయ్యాయి. మరికొన్ని సీట్లు భర్తీ కానందున ఈ నెల 10 వరకు ఆసక్తి గల అభ్యర్థులు మెదక్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం దరఖాస్తులు అందజేయాలని జిల్లా యుజవన క్రీడా అధికారి నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత పరీక్ష నిర్వహించి ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికేట్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో 7వ తరగతి కనీస విద్యార్హత కలిగి ఉండాలని, కంప్యూటర్స్ కోర్సు ఎంఎస్ ఆఫీస్ పదో తరగతి విద్యార్హత కలిగి ఉండాన్నారు. కంప్యూటర్ సీ లాంగ్వేజ్ ఇంటర్మీడియట్ విద్యార్హత, సీసీ టీవీ రిపేర్, అమరిక కోర్సు, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, మొబైల్ సర్వీసింగ్, రిపేర్, మగ్గం వర్క్‌లలో శిక్షణ పొందడానికి పదో తరగతి పాస్ లేదా ఫేయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకువచ్చని తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు.

## అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకానికి..

మెదక్ రూరల్, అక్టోబర్ 4: జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో జిల్లా హబ్ ఎంపవర్‌మెంట్ ఉమెన్ నందు అవుట్‌స్సోర్సింగ్ ప్రతి ప్రాపదికన ఉద్యోగనియమాకానికి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అకౌంట్స్ అసిస్టెంట్ ఒక పోస్ట్ ఖాళీగా ఉందని, గౌరవ వేతనం 20వేలు ఉంటుదన్నారు. డిగ్రీలో బీకాం లేదా డిప్లొమాలో అకౌంట్స్ సంబంధిత సబ్జెక్స్ కలిగి ఉండాలన్నారు. 25 నుంచి 40 ఏండ్ల వయస్సు మించరాదన్నారు. ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు ఈ నెల 3 నుంచి 10వ తేదీలోగా జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.